క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతి పత్రమిస్తున్న ఉద్యోగులు

కలువాయి(సైదాపురం): మండలంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఆందోళన చేపడతామని ముందస్తు హెచ్చరిక నోటీసులు శుక్రవారం ఏఓ శివప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. వార్డు సచివాలయ జాయింట్ కమిటీ కలువాయి మండల సంఘం సభ్యులు క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారని ఇంటింటి సర్వేపై విముక్తి కలిగించాలని వారు వినతి పత్రంలో కోరారు.

వడ్డీలు సకాలంలో చెల్లించండి

సైదాపురం: సహకార రుణాల వడ్డీలను సకాలంలో చెల్లించాలని గూడూరు సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ మేకల హరికృష్ణ కోరారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలోని రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ బ్యాంకు ద్వారా సుమారు 200 మందికిపైగా రైతులకు రుణాలను మంజూరు చేసి ఉన్నామన్నారు. తద్వారా రూ.72లక్షల మేర రుణాలకు సంబంధించిన వడ్డీలు రైతులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. వెంటనే వడ్డీలను చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట సూపర్‌వైజర్ సాయి, సీఏ శ్రీనివాసులు ఉన్నారు.

పొలాలకు దారి చూపండి

సూళ్లూరుపేట రూరల్ : నాయుడుపేట పట్టణ పరిధిలోని ఎల్‌ఏ సాగరం చెరువు ఆయకట్టుకు దారి చూపాలంటూ రైతులు శుక్రవారం సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ రవిమార్‌కు వినతిపత్రం అందించారు. జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా ఎల్‌ఏ సాగరం చెరువుకు సంబంధించి పంట కాలువలు పూడ్చివేసి రూపురేఖలు లేకుండా చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సేవా పక్షోత్సవాలు

పెళ్లకూరు: భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి వెల్లడించారు. తాళ్వాయిపాడు పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

ముగిసిన ఆర్మీ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఆర్మీ జవాన్లు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఐదు రోజులుగా జరుగుతున్న ఆర్మీ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసినట్లు ఆర్మీ అధికారి కల్నల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఆర్మీ జవాన్లకు ఎన్‌సీసీ ఆఫీసర్లుగా పని చేసేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్మీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పలు రాష్ట్రాలకు చెందిన 35 మంది శిక్షణలో పాల్గొన్నారని చెప్పారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పత్రాలను అందజేశారు. ఎన్‌సీసీ ఆఫీసర్ మాధవయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ర్యాలీ



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బాలాయపల్లి(సైదాపురం): విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధులబారిన పడకుండా చదువుపై ఆసక్తి చూపగలరని వెంకటగిరి సీడీపీఓ శంషాద్‌బేగం పేర్కొన్నారు. మండలంలోని వెంగమాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మిషన్ శక్తి ప్రోగ్రాంలో భాగంగా సంకల్ప ప్రోగ్రాం ర్యాలీ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

నాయుడుపేటటౌన్/దొరవారిసత్రం : విధి నిర్వహణలో ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎస్‌పీడీసీఎల్ జిల్లా టెక్నికల్ డైరెక్టర్ కే గురవయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఈఈ కార్యాలయంలో శుక్రవారం నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని డీఈలు, ఏఈలతో టెక్నికల్ డైరెక్టర్ సమీక్షించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలపై తక్షణం స్పందించి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఈఈ శ్రీనివాసులు, డీఈలు వరప్రసాద్ రెడ్డి, ఆర్ శేఖర్, శ్రీనివాసులు, ఏఏఓ శ్రీలత, 12 మండలాలకు చెందిన, ఏఈలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు		13-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	141
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	250
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	274
లేయర్ చికెన్	:	195

సర్కారు భవనాలు.. చీకటి పనులు

- నిర్మాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- కట్టడాలపైనే రాజకీయ కక్ష సాధింపులు
- స్థానిక అధికారుల తీరుపై విమర్శలు





పెట్లూరు భవనం కార్యాలయం ఆవరణ వద్ద, పీఏసీఎస్ గోదాము పరిసర ప్రాంతాల్లో పడి ఉన్న మద్యం సీసాలు

వెంకటగిరి రూరల్: గ్రామ స్థాయిలోని సుపరిపాలన అందించాలన్న దృఢ సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోట్లు వెచ్చించి గ్రామాల్లోనే సచివాలయం, ఆర్‌బీకేలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లతోపాటు పీఏసీఎస్ భవనాలను ఏర్పాటు చేశారు. ఈ భవనాల పర్యవేక్షణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో యథేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ మేరకు నివారించాల్సిన అధికారులు తగు చర్యలు తీసుకోకపోవడం, భవనాలపై పర్యవేక్షణ కొరవడడంతో ఆగడాలు మితిమీరిపోతున్నాయి. దీంతో ఆ భవనాల పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మద్యం, కూల్‌డ్రింక్ బాటిళ్లు, బీర్ సీసాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని పెట్లూరు పంచాయతీలో ఏర్పాటు చేసిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే, పీఏసీఎస్ గోదాముల భవనాలను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. నిర్మించిన అన్నీ భవనాల్లో మద్యంబాటిళ్లు, ఖాళీ వాటర్‌బాటిళ్లు, వాటర్ ప్యాకెట్స్, బీర్ బాటిళ్లు దర్శన మిస్తున్నాయి. ప్రభుత్వ పరిపాలన భవనం ఆవరణలో ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమయ్యారంటూ పలువురు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో రూ.కోట్లు ఖర్చు పెట్టి భవనాలను నిర్మిస్తే పర్యవేక్షణ తీరు ఇదేనా మండిపడుతున్నారు. అంతేగాకుండా గత ప్రభుత్వం నిర్మించి ప్రారంభించిన భవనాలపై వైఎస్సార్, ఆర్‌బీకే పేరును తొలగించడంతోపాటు శిలాఫలకంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం, వైఎస్సార్‌సీపీ పెద్దల ఫొటోలను సైతం ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ఓర్వలేకనే పర్యవేక్షణ లోపం, భవనాలపై పేర్ల తొలగింపు వంటి పైశాచిక చేష్టలకు పాల్పడుతున్నారు. ఇకనైనా అధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.







పీఏసీఎస్ గోదాము వద్ద ఖాళీ మద్యం బాటిళ్లు, ఆర్బీకే భవనం, శిలాఫలకం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలపై గత ప్రభుత్వ చిహ్నాలు తొలగించిన దృశ్యం

కోర్టు ఆదేశాలు పాటించాలి

దక్కిలి: మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 258–1లో గల విద్యుత్ సర్వీసును తిరిగి పునరుద్ధరిస్తు హైకోర్టు ఆదేశాలను పాటించాలని తహసీల్దార్ ఎం శ్రీనివాసులు స్థానిక ట్రాన్స్‌కో ఏఈఈకి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దక్కిలి మురళీరెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 258–1లో తనకు ఎన్నో ఏళ్ల నుంచి విద్యుత్ సర్వీసు ఉందన్నారు. అయితే తనపై కక్షగట్టి విద్యుత్ సర్వీసును అక్రమంగా తొలగించారన్నారు. ఈ వ్యవహారంపై తాను హైకోర్టును ఆశ్రయించగా స్టేటస్‌కో అమలు చేసిందన్నారు. ఈ మేరకు స్టేటస్ కో ఆదేశాలు స్థానిక తహసీల్దార్‌కు అందగా కోర్టు ఉత్తర్వులను అనుసరించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలియజేశారు.

సీతారాం ఏచూరికి నివాళి

నాయుడుపేటటౌన్: భారత కమ్యూనిస్టు ఉద్యమ ముద్దుబిడ్డ కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్ర పటం వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, ముకుందా, షేక్ కాలేషా పలు కార్మిక సంఘల నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ప్రభుత్వ భూమిలో ప్రవేశించరాదు

చిట్టమూరు: మండల పరిధిలోని నార్తువరత్తూరు గ్రామ కాట్రేవు చెరువు పోరంబోకు భూముల్లోకి ఎవరూ ప్రవేశించకూడదని తహసీల్దార్ నరేష్ పేర్కొన్నారు. సాక్షి దిన పత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'అధికార పార్టీ నేతను.. మీ మీదే కేసు పెట్టిస్తా' అనే వార్తకు తహసీల్దార్ స్పందించారు. ఆర్ఐ సుధారాణిని నార్తువరత్తూరు గ్రామానికి పంపించారు. ఆక్రమించిన చెరువు పోరంబోకు భూమి, పూడ్చివేసిన తెలుగు గంగ కాలువను ఆర్ఐ పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిక అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇరిగేషన్ , తెలుగు గంగ అధికారుల సమన్వయంతో ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ ఫిర్యాదు కూడా ఇస్తామని తెలిపారు. ఆక్రమించిన వారికి నోటీలు అందజేస్తామన్నారు.



ఆక్రమించిన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్ఐ సుధ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట/రూరల్ : పట్టణంలోని మన్నారుపోలూరులో ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ వుండదని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా సూళ్లూరుపేట పట్టణంతో పాటు రూరల్ ఏరియా, దొరవారిసత్రం, తడ మండలాల పరిధిలో కూడా విద్యుత్ ఉండదని తెలిపారు.

ఓజిలి: మండలంలోని ఓజిలి, కర్రబల్లవోలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం విద్యుత్ సేవలకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ అనిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

నాయుడుపేటటౌన్: విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ వరప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని జువ్వలపాళెం, మందబైలు, కారుమంచివారి కండ్రిగ, శ్రీనివాసపురం జగనన్న లేవుట్లు, పెళ్లకూరు మండలం చెంబేడు, పెళ్లకూరు, శిరసనంబేడు విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆదర్శ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వేడుకలు

దొరవారిసత్రం : మావిళ్లపాడు గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వేడుకను ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతతో పాటు క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు వస్తాయని ఎంఈఓ కృష్ణయ్య అన్నారు. సభ్యులందరికీ అధికారిక బ్యాడ్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్స్ వాసంతి, అబ్దుల్‌ముజీబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేస్తున్న నిర్వాహకులు

విద్యుత్ కోతలతో తాగునీటి కష్టాలు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని అంబలపూడి అరుంధతీయ వాడలో విద్యుత్ అంతరాయంతో మూడు రోజుల నుంచి తాగునీటికి అవస్థలు పడక తప్పడంలేదు. గ్రామస్తులు వివరాల్లోకి వెళితే.. బుధవారం తెల్లవారు జామున వచ్చిన గాలీవానకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు మరమ్మతులకు గురికావడంతో ట్రాన్స్‌కో- అధికారులు పట్టించుకోకపోవడం వల్ల మూడు రోజుల నుంచి తాగునీటికి అవస్థలు పడక తప్పడం లేదని తెలిపారు. అరుంధతీయ వాడలో 100 కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. సమీపానికి చెరువులో ఏర్పాటు చేసి ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద ఊరిలోకి వెళ్తున్న పైప్‌లైన్ నుంచి తాగునీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని తెలియజేశారు. చిన్నపాటి వర్షం వచ్చినా విద్యుత్ అంతరాయం జరిగి తాగునీటికి అవస్థలు పడక తప్పడం లేదని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటికి సమస్యకు పరిష్కార మార్గం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

15 నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

గూడూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మార్పులు తీసుకురావడంతో ప్రజలు, దస్తావేజు లేఖరులు (డాక్యుమెంట్ రైటర్లు) ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గూడూరు డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, న్యాయవాది రాయసం సుబ్బారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో గూడూరు శుక్రవారం డాక్యుమెంట్ రైటర్స్ సమావేశం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ అన్ని డాక్యుమెంట్లకు ఓటీపీ విధానం సరికాదన్నారు. ఈ లోపాలు సరిచేసే వరకు ఈనెల 15 నుంచి పెన్‌డౌన్ చేపడుతున్నట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



వెంకటగిరి రూరల్ : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతర పురస్కరించుకుని బుధ, గురువారాల్లో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం ప్రత్యేక బస్సుల ద్వారా ప్రయాణికులు, భక్తులు లక్షలాదిమంది వెంకటగిరికి చేరుకున్నారు. అమ్మవారి జాతర ముగిసిన అనంతరం శుక్రవారం స్వగ్రామాలకు వెళ్లే పట్టణ ప్రజలు బస్సుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆలస్యంగా వచ్చిన ఆ బస్సుల్లో ప్రయాణికులు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

తడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు పార్టీ మండల ఉపాధ్యక్షులుగా కామిరెడ్డి నందారెడ్డి, ముళవాయల్ రమేష్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా దేశింగ్, శివకుమార్, రమణయ్య, ట్రెజరర్‌గా యస్ రవి, కార్యదర్శులుగా సుధాకర్, మణికంఠ, యువరాజ్, కుమార్ రెడ్డి, విజయ్‌రెడ్డి నియమితులయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులను నియమించారు.

14న ఉచిత వైద్యశిబిరం

కోట: గూడలిలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 14న ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆములూరు నాగార్జున శుక్రవారం తెలిపారు. కోట జనతా క్లినిక్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఉంటుందని చెప్పారు. నిపుణులైన వైద్యులచే అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు.

పాఠశాల తనిఖీ

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం రుచికరంగా భోజనం పెట్టాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన శుక్రవారం వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని మోపూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

కోట: దుగ్గరాజపట్నం మెరైన్ పోలీస్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివసొమ్మ, ప్రిన్సిపల్ వెంకన్న పాల్గొన్నారు.

వీఆర్ఏల వినతి

కోట: తమ డిమాండ్లు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు కోరారు. స్థానిక తహసీల్దార్ జయజయరావుకు శుక్రవారం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంపుదల చేయాలని కోరారు. అర్హులైన వారికి వీఆర్వోలుగా ప్రమోషన్ కల్పించాలని, ఈ నెల 15న వీఆర్ఏల సమావేశానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తూతూమంత్రం

పెళ్లకూరు: మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యూరియా వాడకంపై అవగాహన కార్యక్రమం తూతూమంత్రంగా సాగింది. ఏడీఏ నాగార్జునసాగర్, మండల ఏఓ విజయభారతి, వీఏఓలు పుట్టయ్య, అశోక్ తదితరులు అరకొర రైతులతో మొక్కుబడిగా కార్యక్రమం ముగించేయడం గమనార్హం.

మట్టి పరీక్షలు అవసరం

వాకాడు: ఎలాంటి పంటలు సాగు చేస్తే విజయవంతమైన దిగుబడి సాధించవచ్చో తెలుసుకోవాలంటే ముందుగా మట్టి పరీక్ష చేయించాలని తిరుపతికి చెందిన వ్యవసాయాధికారులు తెలిపారు. మట్టిలోని ధాతువులను తెలుసుకునేందుకు మట్టి నమూనాల సేకరణ, పరీక్షపై గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ప్రతి మూడు సంవత్సరాలకోసారి తాము సాగు చేసే భూమిలో రైతులు మట్టి నమూనాలను పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు, శ్రీనివాస్, సాయిల్ టెస్ట్ అధికారి చక్రవర్తి, కేవీకే సైంటిస్ట్ రాజీవిని, వాకాడు ఏఓ దీప, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పాల్గొన్నారు.

16 నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలి ఉన్నత పాఠశాలలో 16, 17 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శైలజ పేర్కొన్నారు. ఓజిలి విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఆమె పీడీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 69వ స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్ 14, 17 బాల, బాలికల క్రీడలు ఖోఖో, వాలీబాల్, చెస్, కబడ్డీ, యోగాలను నిర్వహిస్తున్నామన్నారు.

దక్కిలి మండలంలో..

దక్కిలి: మండలంలోని అండర్ 14,అండర్ 17 బాల బాలికలకు ఈ నెల 16 నుంచి 17వ తేదీ వరకు దక్కిలి ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణంలో 69 స్కూల్ గేమ్స్ ,అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ క్రీడా పోటీలు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రీడలకు సంబంధించి దక్కిలి జెడ్పీ హైస్కూల్ పీడీ, మండల కో–ఆర్డినేటర్ రాపూరు వెకటయ్య 70953 18073ను సంప్రదించవచ్చునన్నారు.

యూరియాపై అవగాహన ర్యాలీ

నాయుడుపేటటౌన్: రైతులు జీవన ఎరువులు, యూరియా వాడకం వాటి లభ్యత తదితర విషయాలపై శుక్రవారం రైతులతో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా మండల వ్యవసాయాధికారి జోగి గణేష్ సారథ్యంలో పట్టణంలో ఏఓ కార్యాలయం వద్ద మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులకు నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ, రైతులతో కలిసి మానవహారం నిర్వహించారు.



ర్యాలీ చేస్తున్న రైతులు, ఏఓ గణేష్

యూరియాపై అవగాహన

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట రైతులకు యూరియా వ్యవసాయ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మానవహారం ఏర్పాటు చేసి యూరియా వాడకంపై క్షుణ్ణంగా వివరించారు. ఈ ప్రాంతంలో ఇంకా సీజన్ మొదలవలేదని యూరియా కొరత లేకుండా రైతులకు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ

పెళ్లకూరు: మండలంలోని భీమవరం గ్రామంలో ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలోని 50మంది విద్యార్థులకు శుక్రవారం మనోజ్ హార్వెస్టెర్ యజమాని శ్రీనివాసులు స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం రాగిజావ తాగేందుకు వీలుగా ఈ గ్లాసులు అందజేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

చిల్లకూరు : చిన్నతనంలో ఆడపిల్లలకు వివాహాలు జరిపిస్తే భవిష్యత్తులో శారీరక రుగ్మతలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ సూచించారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లులు, కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం

గూడూరురూరల్/చిల్లకూరు/పెళ్లకూరు: ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని ఏపీటీఎఫ్ గూడూరు మండల శాఖ అధ్యక్షులు లక్ష్మీనారాయణ విమర్శించారు. గూడూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు ఆందోళన చేశారు.

చిల్లకూరు మండలంలో ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి డీటీకి వినతి పత్రం అందించారు.



పెళ్లకూరు : నిరసన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజ్‌కు వినతి పత్రం అందించారు.

క్రీడా పోటీల ఎంపికలు

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. 69వ స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాలుర విభాగంలో క్రీడా పోటీలు జరిగాయి. ఎంఈఓ సునీల, హెచ్‌ఎం చంద్రమౌళి క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అథ్లెటిక్స్, చెస్, యోగా, బ్యాడ్మింటన్ పోటీ ఎంపికలు జరిగాయి. సుమారు 250 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారని మండల క్రీడా కో–ఆర్డినేటర్ సన్నాయి భాస్కర్ తెలిపారు.

కోలాహలం.. వసంతోత్సవం



స్వామి, అమ్మవార్ల వసంతోత్సవం

చిట్టమూరు : మండల పరిధిలోని మల్లాం గ్రామంలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం కోలాహలంగా సాగింది. స్వామి, అమ్మవార్ల కల్యాణం అనంతరం మరుసటి రోజు వసంతోత్సవం నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా వసంతాల్లో మునిగితేలారు. రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించారు.